సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 29 । అక్టోబర్‌ । 2024



సైబర్‌ నేరాలపై అప్రమత్తం

సైబర్‌ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఐ ప్రతినిధి కల్యాణ్‌ చక్రవర్తి అన్నారు. వివరాలు 10లో ▸

ఐడియా ఎల్లలు దాటె..

జీవితం ఘుమఘుమల బాటే..



- 'నెట్టింట' మారుమోగుతున్న తిగుళ్ల లచ్చవ్వ పేరు
- వెరైటీ పిండివంటలకు కేరాఫ్‌ అడ్రస్‌
- యూట్యూబ్‌ చానల్‌లో వీడియోలు చూసి జోరుగా ఆర్డర్లు
- విదేశాలకు సైతం పార్శిళ్లు..

ఆ పిండివంటల ఘుమఘుమలు ఎల్లలు దాటాయి.. 'నెట్టింట' తిగుళ్ల లచ్చవ్వ పేరు మారుమోగుతోంది.. ఇందుకు ప్రధాన కారణం ఒక ఐడియా.. జీవితాన్ని మార్చేసింది. ఇందుకు లచ్చవ్వ జీవితమే ప్రత్యక్ష నిదర్శనం. వెరైటీ పిండివంటలకు కేరాఫ్‌ అడ్రస్‌గా మారింది. ఆమె తయారు చేస్తున్న వంటలు దేశీయులతోపాటు విదేశీయులు కూడా లొట్టలేసుకుంటూ ఆరగించేస్తున్నారు. ఆమె చేసే పిండివంటలు తిని వావ్‌.. అదుర్స్‌ అనాల్సిందే. అంతేకాదు.. కస్టమర్ల నుంచి ఆర్డర్లు తీసుకొని డోర్‌ డెలివరీ సేవలు కూడా అందజేస్తోంది. సరదాగా తన కూతురు యూట్యూబ్‌లో పెట్టిన వీడియోలు తన జీవితాన్నే మార్చేస్తుందని అప్పుడనుకోలేదు. కానీ అనూహ్య మార్పును తీసుకొచ్చింది నమ్మశక్యం కాని నిజం. నేడు ఆమె ఎందరికో ఉపాధికి బాసటగా నిలిచింది.

– చల్లా రాజు, హుస్నాబాద్‌

10లో ▶



చిన్నారులకూ.. యూనిఫాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను అభ్యసించే చిన్నారులకు సైతం డ్రెస్‌ కోడ్‌ను అమలు చేయనున్నారు. ఇప్పటి వరకు పాఠశాల స్థాయి విద్యార్థులకే యూనిఫాంలు అందించారు. ఇక నుంచి అంగన్‌వాడీలలో 3 నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ఉచితంగా ఏకరూప దుస్తులు అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలతో కుట్టించారు. త్వరలో పంపిణీ చేసేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ చర్యలు చేపడుతోంది.

అంగన్‌వాడీ కేంద్రాల్లో డ్రెస్‌ కోడ్‌

- తొలి విడతలో 440 కేంద్రాల్లో సరఫరాకు నిర్ణయం
- 12వేల మంది చిన్నారులకు అందించేందుకు చర్యలు

ప్రాజెక్ట్‌ పేరు	కేంద్రాలు	బాలురు	బాలికలు
గజ్వేల్‌	105	1,897	3,572
సిద్దిపేట	67	853	977
దుబ్బాక	66	969	1,095
చేర్యాల	104	1,431	1,455
హుస్నాబాద్‌	98	1,051	1,325

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వ పాఠశాలకు అనుబంధంగా ఉండే అంగన్‌వాడీ కేంద్రాల్లో తొలి విడతలో డ్రెస్‌ కోడ్‌ అమలు చేయాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా 1,150 అంగన్‌ వాడీ కేంద్రాలున్నాయి. అందులో తొలివిడతలో 440 కేంద్రాల్లోని 12,728 మంది చిన్నారులకు యూనిఫాంలను అందించనున్నారు. చిట్టి, పొట్టి చిన్నారులు ఇక యూనిఫాంలతో అంగన్‌వాడీ కేంద్రాల్లో సందడి చేయనున్నారు. ప్రైవేట్‌ పాఠశాలల విద్యార్థుల తరహాలో చిన్నారులు కన్పించనున్నారు.

అంగన్‌వాడీలకు హంగులు

జిల్లాలో పలు అంగన్‌వాడీ కేంద్రాలను కొత్త హంగులతో రూపుదిద్దుతున్నారు. తొలి విడతలో 15 కేంద్రాలకు రంగులు వేసేందుకు ఒక్కో కేంద్రానికి రూ.65వేలను కేటాయించారు. రంగులు వేయడం పూర్తి కావచ్చింది. అలాగే కార్పొరేట్‌ పాఠశాలలకు దీటుగా ఏర్పాటు చేసేందుకు కలర్‌ బెంచ్‌లు, ర్యాక్‌లను అందించారు.

ఆకర్షించే డిజైన్లు..





చిన్నారులను ఆకర్షించేందుకు పలు రకాల డిజైన్లలో ఏకరూప దుస్తులను ప్రభుత్వం ఎంపిక చేసింది. బాలికలకు ఫ్రాక్‌, బాలురకు నెక్కర్‌, షర్ట్‌ను ఇవ్వనున్నారు. యూనిఫాంతో చిన్నారులు మరింత మురిసిపోనున్నారు. తల్లిదండ్రులు కూడా యూనిఫాంలో తమ పిల్లలను చూసి సంతోషంగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపనున్నారు. త్వరలో సీఎం రేవంత్‌ రెడ్డి లాంఛనంగా యూనిఫాం పంపిణీ ప్రక్రియను ప్రారంభించనున్నారు.

త్వరలో అందిస్తాం



తొలి విడతలో ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు త్వరలోనే యూనిఫాంలను అందించనున్నాం. ఇప్పటికే డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో దుస్తులు కుట్టించాం. ప్రైవేట్‌ పాఠశాలలకు దీటుగా ఉండాలన్న ఉద్దేశంతో చిన్నారులకు యూనిఫాంలు అందజేస్తున్నాం. పలు అంగన్‌ వాడీ కేంద్రాలకు రంగులు సైతం వేయించాం.

-శారద, డీడబ్ల్యూఓ

న్యూస్‌రీల్‌

అదనపు కలెక్టర్‌ (రెవెన్యూ)గా అబ్దుల్‌ హమీద్‌

సిద్దిపేటరూరల్‌: జిల్లాకు అదనపు కలెక్టర్‌ (రెవెన్యూ)గా అబ్దుల్‌ రెహమన్‌ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా సివిల్‌ సర్వీసెస్‌ రెవెన్యూ విభాగం సంబంధించి స్పెషల్‌ గ్రేడ్‌ డిప్యూటీ కలెక్టర్లతో పాటు అదనపు కలెక్టర్ల బదిలీలను ప్రభుత్వం చేపట్టింది. ప్రస్తుతం అదనపు కలెక్టర్‌ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి 2022 నుంచి విధులు నిర్వహిస్తుండగా ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లారు. స్పెషల్‌ గ్రేడ్‌ డిప్యూటీ కలెక్టర్‌గా చీఫ్‌ ఎలక్టోరల్‌ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అబ్దుల్‌ హమీద్‌ జిల్లా అదనపు కలెక్టర్‌ (రెవెన్యూ)గా బదిలీపై వచ్చారు.

గజ్వేల్‌ ఆర్డీఓగా వీవీఎల్‌ చంద్రకళ

గజ్వేల్‌: నూతన ఆర్డీఓగా వీవీఎల్‌ చంద్రకళ నియమితులయ్యారు. స్కూల్‌ ఎడ్యుకేషన్‌ శాఖలో రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఈమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఆర్డీఓగా పనిచేసిన బన్సీలాల్‌ కొల్లాపూర్‌కు బదిలీపై వెళ్లారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు వినతి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని యూత్‌ కాంగ్రెస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్జు యాదవ్‌ సోమవారం అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజ్జు యాదవ్‌ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. చర్లఅంకిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ధాన్యాన్ని దళారుకు విక్రయించే అవకాశం ఉందన్నారు. కలెక్టర్‌ స్పందించి వెంటనే గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

బ్యాంకర్లు టార్గెట్‌ను పూర్తి చేయాలి

లీడ్‌ బ్యాంక్‌ మేనేజర్‌ హరిబాబు



మాట్లాడుతున్న ఎల్‌డీఎం హరిబాబు

సిద్దిపేటరూరల్‌: జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని బ్యాంకర్ల రుణాల మంజూరుకు సంబంధించి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని లీడ్‌ బ్యాంక్‌ మేనేజర్‌ హరిబాబు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌ హాల్‌లో సంబంధిత బ్యాంకర్ల త్రైమాసిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ వ్యవసాయం, వ్యవసాయాధారిత రంగాలకు, వ్యాపారులకు వీలైనంత ఎక్కువగా బ్యాంకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. జన సురక్ష క్యాంపులు నిర్వహించి కస్టమర్లందరికీ ఇన్సూరెన్స్‌ చేయాలని సూచించారు. స్వయం సహాయక బృందాల రుణాల మంజూరులో జిల్లా టాప్‌లో ఉందని, పీఎంఎఫ్‌ఎంఈలో కూడా జిల్లా రెండో స్థానంలో ఉందన్నారు.

మండలి ఎన్నికల బరిలో నిలుస్తా..

ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి



మిరుదొడ్డి(దుబ్బాక): ఉపాధ్యాయ సంఘాల సహకారంతో వచ్చే శాసన మండలి ఎన్నికల బరిలో నిలుస్తానని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మండల పరిధిలోని మల్లుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్‌ హెడ్‌మాస్టర్‌గా పనిచేసిన తెనిగిండ్ల భూమలింగం ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆశీస్సులతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సేవ చేసే అవకాశాన్ని మరొక్క పర్యాయం కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మకమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను కోరారు. ఎంఈఓలు ప్రవీణ్‌ బాబు, జోగు ప్రభుదాసు, ఎంఈఓ అంజయ్య, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి

సెట్విన్‌ చైర్మన్‌ గిరిధర్‌ రెడ్డి

సిద్దిపేటజోన్‌: రాష్ట్ర వ్యాప్తంగా సెట్విన్‌ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన శిక్షణ తరగతులు విస్తృతంగా ఏర్పాటు చేస్తామని రాష్ట్ర సెట్విన్‌ చైర్మన్‌ గిరిధర్‌ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్‌ ఓబీసీ సెల్‌ చైర్మన్‌ సూర్యవర్మ ఆధ్వర్యంలో ప్రతినిధులు నగరంలో మంత్రి పొన్నంతో సెట్విన్‌ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సెట్విన్‌ చైర్మన్‌ను సన్మానించారు. జిల్లా సెట్విన్‌ ప్రక్రియ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ నూతి శ్రీకాంత్‌గౌడ్‌ పాల్గొన్నారు.



సెట్విన్‌ చైర్మన్‌ గిరిధర్‌రెడ్డిని సన్మానిస్తున్న మంత్రి పొన్నం, శ్రీకాంత్‌ గౌడ్‌ తదితరులు

రక్తదానం చేయండి.. ప్రాణదాతలుకండి

- సీపీ అనురాధ
- పోలీస్‌ కమిషనరేట్‌లో రక్తదాన శిబిరం

సిద్దిపేటకమాన్‌: రక్తదానంతో ఆపదలో ఉన్న వారికి ప్రాణదాతలమవుదామని సీపీ అనురాధ అన్నారు. పోలీస్‌ అమరవీరుల సంస్మరణ దినంలో భాగంగా సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని అనురాధ ప్రారంభించారు. పోలీసు అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసు అమరుల త్యాగాలను స్మరిస్తూ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. రక్తదాన శిబిరంలో 62 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో అమరులైన పోలీస్‌ వీరులను సమాజం ఎప్పుడూ గుర్తుంచుకుంటుందన్నారు. వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మూడు నెలలకోసారి రక్తదానం చేయాలని సూచించారు. ఏ జిల్లాలో లేని విధంగా సిద్దిపేట జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది వాట్సప్‌ గ్రూప్‌ ఏర్పాటు చేసి నిత్యం ఎవరో ఒకరు రక్తదానం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు మల్లారెడ్డి, సుభాష్‌ చంద్రబోస్‌, ఏసీపీ మధు, ట్రాఫిక్‌ ఏసీపీ సుమన్‌కుమార్‌, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌గౌడ్‌, కిరణ్‌, వన్‌ టౌన్‌ సీఐ వాసుదేవరావు, టూటౌన్‌ సీఐ ఉపేందర్‌, త్రీ టౌన్‌ సీఐ విద్యాసాగర్‌, ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌కుమార్‌, చేర్యాల సీఐ శ్రీను, రిజర్వ్‌ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో సీపీ అనురాధ తదితరులు

అర్జీలు సత్వరం పరిష్కారం

- అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్‌ మిక్కిలినేని మనుచౌదరి
- ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులు 19

సిద్దిపేటరూరల్‌: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రజలు అందించిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్‌ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ అర్జీలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. భూ సమస్యలు, పెన్షన్‌, ఇళ్లకు సంబంధించి మొత్తం 19 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌ఓ నాగరాజమ్మ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టండి

మాది దొమ్మాట గ్రామం. చేర్యాల మండలం. గుర్జకుంట ఎక్స్‌ రోడ్‌ నుంచి దొమ్మాటకు వెళ్లేందుకు పంచాయతీరాజ్‌ శాఖ ద్వారా రోడ్డు నిర్మాణం చేపట్టారు. పూర్తి స్థాయిలో నిధులు మంజూరైనప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్‌ మాత్రం నిర్మించడం లేదు. ప్రస్తుతం రోడ్డంతా గుంతలుగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి రోడ్డును నిర్మించాలి. – దొమ్మాట గ్రామస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్‌ మనుచౌదరి

పశువుల గణనకు సహకరించండి

పశుసంవర్ధక శాఖ అధికారులు సేకరించే పశుగణనకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కలెక్టర్‌ మనుచౌదరి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌ హాల్‌లో ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ఫిబ్రవరి 2025 వరకు జరిగే పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అధికారులు ఇంటింటికీ తిరిగి పశువుల వివరాలను సేకరిస్తారన్నారు. పశువుల సంఖ్య ఆధారంగా వ్యాక్సిన్లు, సబ్సిడీ దాన, ఇతర పథకాల రూపకల్పనకు ప్రభుత్వానికి సులభంగా మారుతుందన్నారు.

వ్యాపారుల చీకటి దందా



హుస్నాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌లో వడ్లను కాంటా పెట్టి లారీల్లో లోడింగ్‌ చేస్తున్న కార్మికులు

- అనుమతి లేకున్నా మార్కెట్‌ యార్డులో ధాన్యం కొనుగోళ్లు
- అడ్డుకున్న అధికారులపై జులుం
- రాత్రికి రాత్రే ఇతర జిల్లాలకు తరలింపు..

హుస్నాబాద్‌: స్థానిక వ్యవసాయ మార్కెట్‌ యార్డులో వ్యాపారులు చీకటి దందాకు తెరలేపారు. అనుమతి లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా సోమవారం రాత్రి మార్కెట్‌ యార్డులో ధాన్యం కొనుగోలు చేయడమేకాకుండా.. అడ్డుకున్న సింగిల్‌ విండో అధికారులపై జులుం ప్రదర్శించారు. హుస్నాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌లో విశాల పరపతి సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లర్లకు పంపించాల్సి ఉంటుంది. ట్రేడ్‌ లైసెన్స్‌లు పొందిన వ్యాపారులు వారికి కేటాయించిన గదుల్లో బయట కొనుగోలు చేసిన ధాన్యాన్ని మాత్రమే నిలువ చేసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా రాత్రికి రాత్రే వ్యాపారులు మార్కెట్‌ యార్డులోనే వడ్లు కొనుగోలు చేసి అక్కడే కాంటా పెట్టి లారీలు, వాహనాల్లో నింపి ఇతర జిల్లాలకు తరలించడం గమనార్హం. హమాలీలు సైతం వ్యాపారులు, దళారులు మాటలు విని కాంటా పెడుతున్న పరిస్థితి నెలకొంది.

వ్యాపారులు బెదిరించారు..

నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులు జబర్దస్తీగా మార్కెట్‌లోకి వచ్చి పచ్చి వడ్లను కొనుగోలు చేశారని సింగిల్‌ విండో సీఈఓ తిరుమల తెలిపారు. రైతులు మార్కెట్‌కు తెచ్చిన ధాన్యాన్ని కూడా వ్యాపారులు కొనుగోలు చేశారని వాపోయారు. ఇదేమిటని అడిగితే మాకు లైసెన్స్‌లు ఉన్నాయని బెదిరించారని తెలిపారు. ఈ విషయంపై ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తామని సీఈఓ తెలిపారు.

విద్యార్థుల స్ఫూర్తి గొప్పది

ఏసీపీ మధు

సిద్దిపేటజోన్‌: విద్యార్థుల స్ఫూర్తి చాలా గొప్పదని సిద్దిపేట ఏసీపీ మధు అన్నారు. ఐటీఆర్‌ఆర్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో అంధుల కోసం హైదరాబాద్‌లో నిర్మించనున్న భవన నిర్మాణం కోసం అంబిటస్‌ పాఠశాల విద్యార్థులు రూ. లక్షా 7,500 రూపాయల చెక్కును సోమవారం ఏసీపీ మధు చేతుల మీద ఫౌండేషన్‌ ప్రతినిధులకు అందచేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని సూచించారు. ప్రతి వ్యక్తి తాను సంపాదించిన దాంట్లో 10 శాతం డబ్బులు సేవా కార్యక్రమాల కోసం వెచ్చించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్‌ శ్రీనివాస్‌ రెడ్డి, ప్రిన్సిపల్‌ జ్యోతి, ఫౌండేషన్‌ ప్రతినిధులు నాగేంద్రమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌లో షాపింగ్‌ కాంప్లెక్స్‌ నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్‌..

తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించిన పాలకవర్గం

గజ్వేల్‌: ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌లో షాపింగ్‌ కాంప్లెక్స్‌ నిర్మాణానికి పాలకవర్గం ఆమోదం తెలిపింది. దేశంలోనే మోడల్‌గా నిర్మించిన ఇంటిగ్రేటెడ్‌ వెజ్‌ అండ్‌ నాన్‌ వెజ్‌ మార్కెట్‌లో ఆదాయం పడిపోతున్న తీరుపై సాక్షిలో ఈనెల 21న 'దేశంలోనే తలమానికం–అయినా నిర్లక్ష్యం' శీర్షికన ప్రచురితమైన కథనానికి మార్కెట్‌ కమిటీ నూతన పాలకవర్గం స్పందించింది. ఈమేరకు ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ పడమర, ఉత్తరం వైపుల్లో షాపింగ్‌ కాంప్లెక్స్‌లను నిర్మించి ఆదాయం పెంచుకోవాలని తీర్మానించింది. మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ నరేందర్‌ రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఈ అంశంపై ప్రధానంగా చర్చించారు. దీని ద్వారా షాపింగ్‌ కాంప్లెక్స్‌ నిర్మాణానికి ముందడుగు పడినట్లయ్యింది. అదేవిధంగా ప్రస్తుత సీజన్‌లో పత్తి, వడ్ల కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కూడా తీర్మానించారు. సమావేశంలో మార్కెట్‌ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ, వైస్‌ చైర్మన్‌ సర్దార్‌ఖాన్‌, సూపర్‌వైజర్‌ మహిపాల్‌తోపాటు డైరెక్టర్లు పాల్గొన్నారు.



గజ్వేల్‌ మార్కెట్‌ కమిటీ పాలకవర్గ సమావేశం

పట్టభద్రుల గొంతుకగా నిలుస్తా

- అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ ప్రసన్న హరికృష్ణ వెల్లడి
- ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉద్యోగానికి రాజీనామా

గజ్వేల్‌: పట్టభద్రుల గొంతుకగా నిలిచి, నిర్మాణాత్మక రాజకీయాలకు నాంది పలుకుతానని గజ్వేల్‌ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ ప్రసన్నహరికృష్ణ అన్నారు. సోమవారం గజ్వేల్‌లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఆ లేఖను కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌, మెదక్‌, ఆదిలాబాద్‌, నిజామాబాద్‌ పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో నిలుస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకోసమే 19సంవత్సరాల సర్వీసు ఉన్న తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. 16ఏళ్లగా నిరుద్యోగ యువతతో మమేకమై పుస్తకాలు, క్లాసులు ఇలా రూపాల్లో వారికి లక్షలాది మందికి అందుబాటులో ఉన్నానని చెప్పారు.



అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ ఉద్యోగానికి రాజీనామా లేఖను అందజేస్తున్న ప్రసన్నహరికృష్ణ

ప్రజల భాగస్వామ్యం అవసరం

ముగిసిన కమిషనర్ల అధ్యయనం

సిద్దిపేటజోన్‌: స్వచ్ఛ సిద్దిపేట, పచ్చదనం నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం, సహకారం గురించి మున్సిపల్‌ కమిషనర్లు ఆరా తీశారు. అధ్యయనంలో భాగంగా చివరి రోజు సోమవారం జిల్లా కేంద్రంలో చెన్నూర్‌, క్యాతన్‌పల్లి, లక్సెట్టిపెట్‌, మంచిర్యాల, నాస్పూర్‌, ఆసిఫాబాద్‌, కాగజ్‌నగర్‌, బాన్స్‌వాడ, కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల కమిషనర్లు పర్యటించారు. అయిదో వార్డులో ఇంటింట చెత్త సేకరణ, తడి, పొడి, హానికర చెత్త విభజన గురించి అడిగి తెలుసుకున్నారు. డంపుయార్డ్‌ను పరిశీలించి, బయోగ్యాస్‌ తయారీ విధానం, ఇతర అంశాలపై వివరాలు సేకరించారు. పట్టణ శివార్లలోని స్లాటర్‌ హౌస్‌ సందర్శించారు. పొడిచెత్త సేకరణ కేంద్రం, స్వచ్ఛ బడిని సందర్శించి పనితీరు తెలుసుకున్నారు. వారికి మున్సిపల్‌ కమిషనర్‌ ఆశ్రిత్‌ కుమార్‌ క్షేత్ర స్థాయిలో వివరించారు. కార్యక్రమంలో ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు సతీశ్‌, వెంకటేశ్వర్లు, అంజయ్య, భుజంగరావు, అంజయ్య, సుజాత, సతీశ్‌, మారుతి ప్రసాద్‌, శ్రీహరి, రాజశేఖర్‌, మురళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు సతీశ్‌, వనిత, మాధవి, మెప్మా సీఓ రమ్య పాల్గొన్నారు.



స్వచ్ఛతపై ఆరాతీస్తున్న మున్సిపాలిటీ కమిషనర్లు

క్లుప్తంగా

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి


కృష్ణమూర్తి (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): ప్రమాదవశాత్తు శరీరానికి నిప్పంటుకొని గాయాలైన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని వల్లంపట్లలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తంగనపల్లి కృష్ణమూర్తి (63) తపాలా శాఖలో పని చేస్తున్నాడు. దీంతో పాటు పెయింటింగ్ పని కూడా చేస్తుంటాడు. ఈనెల 23న పెయింటింగ్ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చాడు. చేతులకు పెయింటింగ్ అంటుకోవడంతో టర్పెంటైన్ ఆయిల్ చేతులపై వేసుకుని రాసుకున్నాడు. బీడీ తాగే అలవాటు ఉండడంతో ఈ సమయంలో అగ్గిపుల్లతో అంటించే క్రమంలో చేతులతోపాటు శరీరం అంతా నిప్పంటుకుంది. కృష్ణమూర్తిని కాపాడేందుకు కుటుంబ సభ్యులు స్థానికులు దుప్పట్లు వేసి మంటలను ఆర్పేందుకు ప్రత్నించారు. అప్పటికే తీవ్రంగా గాయాలైన అతడిని చికిత్స నిమిత్తంగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా ఇక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ మహబుబ్ తెలిపారు. కృష్ణమూర్తికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కూరెళ్లలో గుప్త నిధుల తవ్వకాలు


గుప్తనిధుల కోసం తవ్విన భారీ గుంత

కోహెదరూరల్(హుస్నాబాద్): గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు జోరుగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మండలంలోని కూరెళ్లలో ఆందోళన నెలకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మదాద గుట్ట సమీపంలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ పొలాల వద్ద గుప్త నిధులు ఉన్నట్లు కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతుంది. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు వాటి కోసం ఆదివారం రాత్రి గడ్డపారతో భారీ గుంతలు తవ్వారు. ఈ ప్రాంతంలో కొబ్బరికాయ, నిమ్మకాయలు ఉన్నాయి. అయితే ఎవరు ఎందుకు తవ్వారో? ఏం చేశారో? అని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

వైద్యుడి నిర్లక్ష్యంతోనే వ్యక్తి మృతి


బాధిత కుటుంబసభ్యుల ఆందోళన
పోలీసుల హామీతో విరమణ


యాదగిరి (ఫైల్)

చేగుంట (తూప్రాన్): వైద్యుడు నిర్లక్ష్యంతోనే వ్యక్తి మృతిచెందాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తూ సోమవారం మండల కేంద్రమైన చేగుంటలో నిరసనకు దిగారు. బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనంతసాగర్‌కు చెందిన చందా యాదగిరి (52) మూత్ర సంబంధిత సమస్యతో బాధపడుతూ చేగుంటలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకున్నారు. రిపోర్టులు రాగా వాటిని పరిశీలించిన వైద్యులు ఆపరేషన్ అవసరమవుతుందని చెప్పారు. ఆపరేషన్‌కు టేబుల్ మీద మత్తుమందు ఇస్తున్న క్రమంలో యాదగిరి శరీరం చల్లబడింది. వెంటనే అంబులెన్స్‌లో అతడిని మెదక్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దీంతో వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఇతను మృతిచెందాడని చేగుంటలోని ప్రైవేటు ఆస్పత్రి వద్ద మృతుడి బంధువులు నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించి వారు ఆందోళనను విరమించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

ఐడియా ఎల్లలు దాటె..

తెలంగాణ లచ్చవ్వ పిండివంటలకు దక్కిన పాపులారిటీ


అప్పాలను ముకుడులో కాలుస్తున్న మహిళలు

సరదాగా వంటలు చేసిన వీడియోలు నెట్టింట పోస్ట్ చేస్తే ఇదే ఉపాధికి ఊతమైంది. ఇవి వైరల్ గా మారి రోజురోజుకూ చూసేవారి సంఖ్య పెరుగుతోంది. వాటిని వీక్షించిన వారు తమకిష్టమైన పచ్చళ్లు, పిండివంటలు తయారు చేసి ఇవ్వాలని మెసేజ్‌లు మీద మెసేజ్‌లు పెడ్తున్నారు. దీంతో ఇదేదో బాగుందని గ్రహించారు. అప్పటి నుంచి తెలంగాణ లచ్చవ్వ పిండి వంటలు అనే పేరిట యూట్యూబ్ చానల్ నడుపుతున్నారు. అందులో తయారు చేసిన పిండివంటల వీడియోలు పెడుతున్నారు హుస్నాబాద్‌కు చెందిన తిగుళ్ల లచ్చవ్వ. తాను జీవనోపాధి పొందడమే కాకుండా మరికొంత మందికి ఉపాధిని కల్పిస్తోంది.

–హుస్నాబాద్


గరిజెలు చేస్తున్న మహిళలు

గుడిసెలో కట్టెల పొయ్యిపైనా

లచ్చవ్వకు సొంత ఇల్లు లేదు. అద్దె ఇంటిలో ఉంటుంది. ఆ ఇంటి పక్కనే ఖాళీ స్థలంలో ఓ గుడిసె వేసి పిండి వంటల తయారు చేయడం మూడు నెలల క్రితం మొదలు పెట్టారు. వివిధ శుభకార్యాలకు, పెళ్లిళ్లకు ఆర్డర్ల పైన పిండి వంటలు సప్లయ్ చేస్తున్నారు. గారెలు, సకినాలు, అరిసెలు, పూసలు, గరిజెలు, లడ్డూ, మడుగులు ఇలా పలు రకాలుగా తయారు చేస్తూ ఆర్డర్‌లు తీసుకొని డోర్ డెలివరీ చేస్తున్నారు. పిండివంటలు రుచికరంగా ఉండాలని కట్టెల పొయ్యినే వాడుతున్నారు. పిండిని కలవడం, అల్లం, ఎల్లిపాయలు దంచడం మొదలు కొని ప్రతీ పనిని చేతులతోనే చేస్తున్నారు. వాటితో లచ్చవ్వ ఉపాధి పొందడమే కాకుండా దాదాపు 10 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. పండుగల సమయంలో ఆర్డర్లను బట్టి దాదాపు 20 మంది మహిళలు ఉపాధి పొందుతారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తే ఒక్కో మహిళకు రూ.300లు ఇస్తున్నారు. వివిధ రకాల పచ్చళ్లను తయారు చూస్తూ సప్లయ్ చేస్తున్నారు. ఆర్డర్‌పై మామిడి, నిమ్మకాయ, టమాట, ఉసిరి పచ్చళ్లే కాకుండా చికెన్, చేపలు, రొయ్యల పచ్చళ్లు కూడా తయారు చేస్తున్నారు. పిండి వంటలు కిలోకు రూ.400లు. స్వీట్లు కిలోకు రూ.500లు, చికెన్ పచ్చడి కిలోకు రూ.1,200లు తీసుకొని పార్సిల్ చేసి పంపుతున్నారు.


సిద్ధం చేసిన అప్పాలు, సకినాలు, మడుగులు

భలే క్రేజ్

తెలంగాణ లచ్చవ్వ పిండి వంటలకు భలే క్రేజ్ పెరిగింది. ఎవరికి ఇష్టమైన పిండివంటలు తయారు చేసి ఇవ్వాలని లచ్చవ్వ ఫోన్‌కు వివిధ రాష్ట్రాల నుంచి మెసేజ్‌లు పంపుతున్నారు. ముంబయి, ఢిల్లీ, బెంగళూర్, తిరుపతి, హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్ నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. విదేశాల్లో ఉన్న వారు కూడా లచ్చవ్వ పిండి వంటలకు ఫిదా అయి తమ బంధువుల ద్వారా పిండి వంటలను తీసుకెళ్తున్నారు. పిండి వంటలను ప్రత్యేకంగా అట్టపెట్టెల్లో ప్యాక్ చేసి ఆర్టీసీ కార్గో ద్వారా సప్లయ్ చేస్తున్నారు. వేరే రాష్ట్రాలకు డీటీటీసీ ద్వారా పంపుతున్నారు.

యూట్యూబ్‌లో చక్కర్లు....

తెలంగాణ లచ్చవ్వ.. తయారు చేసిన వంటలు, పచ్చళ్ల వీడియోలు యూట్యూబ్‌లో చక్కర్లు కొడుతున్నాయి. రోజురోజుకు ఆదరణ పెరుగుతుంది. రెండు నెలల కాలంలోనే పిండి వంటలకు యూట్యూబ్‌లో 4.59 లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ చేసుకుని ఫిదా అవుతున్నారు. ప్రతీ నెల ఆమె అకౌంట్‌లో రూ.20వేలు జమ అవుతున్నాయంటే కష్టమర్స్.. పిండివంటలు ఎంత ఇష్టపడుతున్నారో తెలుస్తోంది.



రోజూ పని ఉంటుంది



పిండి వంటలు చేయడం కాల్చడం వంటి పనులు చేస్తాం. ఉదయం వచ్చి సాయంత్రం వరకు పిండి వంటలు చేస్తాం. రోజుకు రూ.300 ఇస్తున్నారు. ఎండలో, వానలో పనికి పోయేకంటే ఇంటి సమీపంలోనే ఒక్క దగ్గర కూర్చొని పని చేయడం సులువుగా ఉంది. మేము సెలవు అంటే తప్ప రోజూ పని ఉంటుంది. ఎక్కడెక్కడి నుంచో ఆర్డర్లు వస్తున్నాయి. ఇంట్లో ఎలా చేసుకుంటామో అంత కంటే రుచికరంగా పిండి వంటలు తయారు చేస్తున్నాం.

కొలుకూరి సరిత, హుస్నాబాద్

ఆర్డర్ పై సప్లయ్ చేస్తున్నాం



మూడు నెలల నుంచి ఆర్డర్ల పై పిండి వంటలు తయారు చేయడం మొదలు పెట్టాం. నా కూతురు నేను చేసిన పిండి వంటల తయారీ వీడియోలను సరదాగా యూట్యూబ్‌లో పెట్టింది. నా వంటలు చేసే పద్ధతి నచ్చి వివిధ రాష్ట్రాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. నేను పంపిన పిండి వంటల రుచి చూసి బాగున్నాయని మెసేజ్ పెడుతున్నారు. పచ్చళ్లు కూడా ఆర్డర్‌పై పంపిస్తున్నా. ఒకరికొకరు చెప్పుకుంటూ ఇలా ఎంతో మంది రకరకాల పిండి వంటలు కావాలని కోరుతున్నారు. వారికిష్టమైన పదార్థాలను తయారు చేస్తున్నాం. మేమే కాకుండా కొంత మంది ఉపాధి పొందుతున్నారు.

తిగుళ్ల లచ్చవ్వ, హుస్నాబాద్

సైబర్ నేరాలపై అప్రమత్తం

- ఓటీపీ, పిన్ నంబర్‌లు ఎవరికీ చెప్పొద్దు
- ఆర్‌బీఐ ప్రతినిధి కళ్యాణ్ చక్రవర్తి


ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్‌బీఐ డీజీఎం కళ్యాణ్ చక్రవర్తి, లీడ్ బ్యాంకు మేనేజర్ హరిబాబు తదితరులు

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఐ ప్రతినిధి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంబుడ్స్‌మన్ హైదరాబాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో సిద్దిపేట ఆర్‌సెటీ సంస్థలో మున్సిపల్ కార్మికులు, టోల్ ప్లాజా సిబ్బంది, సంస్థలో శిక్షణ పొందుతున్న వారికి స్వచ్ఛతా హీ సేవక్, సైబర్ సురక్షిత్ భారత్, నేషనల్ సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ మేనేజర్ లోకేశ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరైన పి.కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలు, నిరక్ష్యరాసులు సైబర్ నేరాలకు గురై మోసపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపామన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంబుడ్స్‌మన్ స్కీమ్ 2021 గురించి కూడా అవగాహన కల్పించామన్నారు. ఖాతాదారుడు ఏదైనా సమస్య ఉంటే మొదటగా బ్రాంచ్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. 30రోజుల తర్వాత న్యాయం జరగకపోతే వినియోగదారుడు సీఎంఎస్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీ నంబర్, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నంబర్ చెప్పకూడదన్నారు. కార్యక్రమంలో భాగంగా క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ హరిబాబు, ఆర్‌సెటీ డైరెక్టర్ డి. రాజలింగం, యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ వికాస్, డిప్యూటీ రిజినల్ హెడ్ రాఘవ, నాబార్డ్ డిడిఎం నిఖిల్‌రెడ్డి, సిబ్బంది సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ వ్యవహారంపై ఇంట్లో ఏమంటారోనని..

యువకుడి ఆత్మహత్య

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రేమ వ్యవహారంలో మనస్తాపం చెంది ఓ యువకుడు కుమ్మరికుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలపరిధిలోని మలపాడ్ శివారులో సోమవారం చోటుచేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్నమనగోని రంజిత్(19) పుల్కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. తోటి క్లాస్‌మేట్ బర్త్ డేకు రమ్మని పిలవడంతో తెల్లవారుజామున 2 గంటలకు పుల్కల్‌లో నివాసముంటున్న యువతి ఇంటికి వెళ్లాడు. వారి ప్రేమ వ్యవహారాన్ని యువతి తల్లిదండ్రులు గమనించి మందలిస్తే స్నేహితులతో కలిసి తిరిగొచ్చాడు. తన విషయం ఇంట్లో తెలిస్తే ఏమంటారోనని మనస్తాపం చెంది గ్రామ శివారులోని కుమ్మరికుంట గట్టుపై తన సెల్ ఫోన్, వాహనం పెట్టి కుమ్మరికుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జహీరాబాద్: మండల కేంద్రమైన కోహీర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యంను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం నమ్మదగిన సమాచారం మేరకు ఓ ఇంటిని తనిఖీ చేసి రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కోహీర్ పోలీసులు అఫ్రోజ్, మజర్, ఫిరోజ్, పెంటయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

సదాశివపేట బైపాస్‌లో రెండు లారీలు ఢీ

- లారీ క్లీనర్, కూలీ దుర్మరణం
- మృతులు ఘట్‌కేసర్ వాసులు
- నిద్రమత్తే ప్రమాదానికి కారణం?

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ పరిధిలోని 65వ నంబర్ జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో లారీ క్లీనర్, కూలీ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతులు ఘట్‌కేసర్‌కు చెందినవారు. పోలీసుల కథనం ప్రకారం.. షామిర్‌పేట నుంచి ఇటుక లోడుతో పాటు ఘట్‌కేసర్ అన్నాజీగూడకు చెందిన కూలీలు విజయ్‌కాంప్లే, వినోద్, ఈశ్వరదేవ, సూరజ్, పరమేశ్వర్, దీపక్‌లను ఎక్కించుకుని జహీరాబాద్ వెళ్తున్న లారీ సదాశివపేట పట్టణ.. బైపాస్‌రోడ్డు నిజాంపూర్ కూడలికి సమీపంలోకి రాగానే టైర్ పంక్చరైంది. డ్రైవర్ కేతావత్ రాజశేఖర్ వాహనాన్ని రోడ్డు పక్కన పార్క్ చేశాడు. వెనుక టైర్ల వద్ద జాకీ ఎక్కిస్తుండగా క్లీనర్ గైక్వాడ్ దీపక్, కూలీ పరమేశ్వర్ సహాయం చేస్తున్నారు. ఇంతలో హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కంటైనర్ లారీ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా వాహనం నడుపుతూ ఆగి ఉన్న లారీని ఢీట్టాడు. ఈ ప్రమాదంలో గైక్వాడ్ దీపక్ (58), కూలి పరమేశ్వర్(37) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. డ్రైవర్ కేతావత్ రాజశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కంటైనర్ క్యాబిన్ నుజ్జునుజ్జుకావడంతో డ్రైవర్ యోగేశ్ ఇరుక్కుపోయాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని అరగంట శ్రమించి అతికష్టం మీద అతడిని బయటకు తీశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కంటైనర్ డ్రైవర్ యోగేశ్, కేతావత్ రాజశేఖర్, దేవీసింగ్‌లను 108 వాహనంలో చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కంటైనర్ లారీ డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. లారీ డ్రైవర్ కేతావత్ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ.మహేశ్‌గౌడ్ తెలిపారు.

వివాహితపై ఆటో డ్రైవర్ అత్యాచారం

జగదేవ్‌పూర్‌లో ఆలస్యంగా వెలుగులోకి

జగదేవ్‌పూర్(గజ్వేల్): వివాహితపై ఆటోడ్రైవర్ అత్యాచారానికి పాల్పడిన సంఘటన జగదేవ్‌పూర్ మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన మహిళ బతుదెరువు కోసం కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటుంది. ఆదివారం వ్యక్తిగత పనితో పాటు పెన్షన్ కోసం స్వగ్రామమైన సాల్వాపూర్‌కు హైదరాబాద్ నుంచి బస్సులో ఎక్కి జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి స్టేజీ వద్ద దిగింది. వట్టిపల్లి నుంచి కాలినడకన గ్రామంలోకి నడుచుకుంటూ వెళ్తుండగా వట్టిపల్లి గ్రామ శివారులో వెనుక నుంచి వస్తున్న ఇదే గ్రామానికి చెందిన యువకుడు కిసారి నర్సింహులు ఆటో నడుపుకుంటూ వచ్చారు. ఆమెను అందులో ఎక్కించుకుని పక్కనున్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకునిపోయి అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు గ్రామంలోని పెద్దల దృష్టికి తీసుకు పోగా సోమవారం జగదేవ్‌పూర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి..

- గీత కార్మికుడి మృతి


బుడిగే కిష్టయ్య (ఫైల్)

కొమురవెల్లి(సిద్దిపేట): తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన సంఘటన మండలంలోని అయినాపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బుడిగే కిష్టయ్య(63) కులవృత్తిలో భాగంగా సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలో కల్లు గీసేందుకు తాడి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు నడుముకు ఉన్న మోకు జారిపోవడంతో కింద పడి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు నవోదయం

- ఈ విద్యాలయంలో 9, 11వ తరగతి అడ్మిషన్‌లు
- ఫిబ్రవరి 8న ఎంట్రెన్స్ పరీక్ష
- ఈనెల 30 వరకు దరఖాస్తుల స్వీకరణ



వర్గల్ నవోదయ విద్యాలయం


డీ రాజేందర్, ప్రిన్సిపాల్

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యాసంవత్సరం 9,11వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఫిబ్రవరి 8న ఎంపిక పరీక్ష ఉంటుందని, ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. ఇందుకోసం ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్ఏవీఓడీఏవైఏ.జీఓవీ.ఇన్ (నవోదయ.గవ్.ఇన్) వెబ్‌సైట్ ద్వారా అక్టోబర్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత, పరీక్ష సిలబస్ తదితర విషయాలను తెలిపారు.

అర్హతలు : ఉమ్మడి మెదక్ జిల్లాకు చెంది ఉండాలి. వారి తల్లిదండ్రులు ఇక్కడే నివాసమై ఉండాలి. 9వ తరగతిలో ప్రవేశం కోసం అభ్యర్థులు ప్రస్తుత విద్యాసంవత్సరం (2024–25)లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదువుతూ ఉండాలి. అభ్యర్థి మే 1, 2010 –జూలై 31, 2012 మధ్య జన్మించి ఉండాలి. 11వ తరగతిలో ప్రవేశం కోసం అభ్యర్థులు ప్రస్తుత విద్యాసంవత్సరం (2024–25)లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి చదువుతూ ఉండాలి. జూన్ 1, 2008 – జూలై 31, 2010 మధ్య జన్మించి ఉండాలి.

9వ తరగతి కోసం ఎంపిక పరీక్ష సిలబస్ : హిందీ, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్‌కు చెందిన ప్రశ్నలు ఉంటాయి. ఓఎమ్ఆర్ ఆధారిత ఆబ్జెక్టివ్ టైప్‌లో పరీక్ష ఉంటుంది. హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ప్రశ్నాపత్రం ఉంటుంది.

11వ తరగతి కోసం ఎంపిక పరీక్ష సిలబస్: మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ సైన్స్‌కు చెందిన ప్రశ్నలుంటాయి. ఓఎమ్ఆర్ ఆధారిత ఆబ్జెక్టివ్ టైప్‌లో పరీక్ష ఉంటుంది. హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ప్రశ్నాపత్రం ఉంటుంది. వివరాలను నవోదయ విద్యాలయ సమితి నోటిఫికేషన్‌లో చూడొచ్చు.

ప్రార్థనా మందిరం పరిశీలన


సార్లవాడలో దాడి జరిగిన ప్రాంత మందిరాన్ని పరిశీలిస్తున్న డీసీపీ మల్లారెడ్డి

కొండపాక(గజ్వేల్): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ.. సార్లవాడలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ వర్గానికి చెందిన ప్రార్థనా మందిరంపై దాడి, పాక్షిక ధ్వంసం చేసిన ఘటనలో ఈ ప్రాంతాన్ని సోమవారం డీసీపీ మల్లారెడ్డి పరిశీలించారు. మందిర నిర్మాణ స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి చుట్టుపక్కల నివాసముంటున్న వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. సర్వే నంబరు 131 ప్రభుత్వ భూమా? పట్టా భూమా? అన్న విషయంతో పాటు నిర్మాణ స్థల భూమి ఎవరి పేరిట ఎలా అసైన్డ్ అయ్యిందనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రార్థనా మందిరం నిర్మాణం చేస్తున్న వ్యక్తి వద్ద ఏ ఆధారాలున్నాయి, పంచాయతీ అనుమతి ఉందా లేదా అనే విషయంపై ఆరా తీశారు. మందిరంపై దాడి జరిగినప్పుడు.. ఇప్పుడు నెలకొన్న పరిస్థితుల గురించి తొగుట సీఐ లతీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయకూడదన్నారు. ఒకవేళ ఇస్తే మతపరమైన అల్లర్లు జరిగే అవకాశాలుంటాయన్నారు. ఘటన స్థలం వద్ద ఎలాంటి అల్లర్లు జరగకుండా ఆదివారం రాత్రి నుంచి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు రిమాండ్

ఈ ఘటనలో ఏడుగురు వ్యక్తులను సోమవారం కుకునూరుపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో తిమ్మారెడ్డిపల్లితో పాటు దమ్మక్కపల్లి, బందారం గ్రామాలకు చెందిన వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.